# సాగర్‌లో ఏపీ అధికారుల దౌర్జన్యం

- క్రస్ట్ గేట్ల వద్ద వాక్‌వే బ్రిడ్జి తాళం ధ్వంసం
- మా పరిధే అంటున్న ఆంధ్రా ఉద్యోగులు

నందికొండ, ఆగస్టు 11 : నాగార్జునసాగర్ డ్యామ్ పైనుంచి క్రస్ట్ గేట్ల సమీపానికి వెళ్లడానికి ఏర్పాటు చేసిన గేటు తాళాన్ని ఆంధ్రా అధికారులు ధ్వంసం చేశారు. క్రస్ట్ గేట్ల సమీపానికి వెళ్లడానికి అనువుగా కొన్నేండ్ల క్రితం వాక్‌వే బ్రిడ్జిని ఏర్పాటు చేశారు. దానికి ఆంధ్రా, తెలంగాణ రెండు వైపులా గేట్లు ఏర్పాటు చేయగా నిర్వహణ పూర్తిగా తెలంగాణ అధికారులు చేపడుతున్నారు. ఆదివారం ఆంధ్రాకు సంబంధించిన సుమారు 20 మంది అధికారులు ఏపీ సీఎం పేషీ నుంచి వచ్చారు. వాక్‌వే బ్రిడ్జి గేట్‌కు తాళం వేసి ఉండటంతో తెలంగాణ ఎస్పీఎఫ్ అధికారులను తాళం చెవి అడిగారు. దాంతో వారు కొంత సమయం పడుతుందని చెప్పడంతో ఆంధ్రా అధికారులు దౌర్జన్యంతో గేట్ తాళం పగులగొట్టి వాక్‌వే బ్రిడ్జి మీదికి వెళ్లిపోయారు. 13వ గేట్ వరకు తమ ఆధీనంలో ఉన్నదంటూ తమ విధులకు ఆటంకం కలిగిస్తున్నారని తెలంగాణ ఉద్యోగులు వాపోతున్నారు. డ్యామ్‌పై కంట్రోల్ రూమ్ 26వ గేట్ అవతల ఉన్నదని అక్కడికి వెళ్లి డ్యూటీ చేసే పరిస్థితి లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఫొటోలు, వీడియోలు ఉన్నతాధికారులకు పంపించినట్టు సమాచారం. ఈ ఘటనపై ఈఈ మల్లికార్జునరావును వివరణ కోరగా ఆంధ్రా అధికారులు తాళం పగులగొట్టిన విషయం తన దృష్టికి వచ్చిందని అన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. డ్యామ్‌పై పహారా కాస్తున్న సీఆర్‌పీఎఫ్ సిబ్బంది ఆంధ్రా నుంచి ఎవరు వచ్చినా అనుమతిస్తున్నది.

## ఉగ్రవాదులతో సైన్యం కుమ్మక్కు: ఫరూక్ అబ్దుల్లా

శ్రీనగర్, ఆగస్టు 11: భారత సైన్యంపై నేషనల్ కాన్ఫరెన్స్ అధ్యక్షుడు, జమ్ముకశ్మీర్ మాజీ ముఖ్యమంత్రి ఫరూక్ అబ్దుల్లా తీవ్ర ఆరోపణలు చేశారు. పెద్దయెత్తున భద్రతా దళాలు సరిహద్దుల వెంబడి మోహరించినా ఉగ్రవాదులు యథేచ్ఛగా భారత్‌లోకి చొరబడుతున్నారని, మనల్ని నాశనం చేయడానికి భద్రతా దళాలు వారితో కుమ్మక్కవుతున్నాయని ఆయన ఆరోపించారు. దీనిపై జమ్ముకశ్మీర్ డీజీపీ ఆర్‌ఆర్ స్వైన్ మాట్లాడుతూ దేశ, సరిహద్దు రక్షణలో ఇప్పటివరకు 7 వేల మంది ప్రాణాలు కోల్పోయారని, మన సైనికులు శత్రుమూకలను ఎదుర్కోవడంలో ముందుండే దేశభక్తులని, అలాంటి వారిపై విమర్శలు శోచనీయమని అన్నారు.




ద్వీపకల్పాన్ని తలపిస్తున్న ఈ ప్రాంతం పేరు సోమశిల. కృష్ణానదికి భారీగా వరద నీరు చేరడంతో శ్రీశైలం ప్రాజెక్టు బ్యాక్‌వాటర్ గుట్టల నడుమ చేరి ఇలా అందాలను తలపిస్తున్నది. టూరిజం కాటేజీలను తాకుతున్న కృష్ణా నది జలాలతో ఆ ప్రాంతం ఆహ్లాదకర వాతావరణాన్ని పంచుతున్నది. చూపరులకు అక్కడి దృశ్యాలు కనువిందు చేస్తున్నాయి. - కపిలవాయి నాగరాజు, నాగర్‌కర్నూలు

# సాగర్‌కు తగ్గిన వరద

## 8 గేట్ల ద్వారా నీటి విడుదల • జూరాలకు 65 వేల క్యూసెక్కులు

న్యూస్‌నెట్‌వర్క్, ఆగస్టు 11: నాగార్జునసాగర్‌కు ఆదివారం 1,20,528 క్యూసెక్కుల వరద రాగా, 8 క్రస్ట్ గేట్లను ఎత్తి 63,120 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. సాగర్ పూర్తిస్థాయి నీటి మట్టం 590 (312 టీఎంసీలు) అడుగులకుగాను ప్రస్తుతం 588 (306.1010 టీఎంసీలు) అడుగుల మేర నీరు నిల్వ ఉన్నది. ఆదివారం సెలవు రోజు కావడంతో డ్యామ్ అందాలను చూసేందుకు పర్యాటకులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. కాగా జూరాల ప్రాజెక్టుకు 65 వేల క్యూసెక్కుల వరద రాగా.. 3 గేట్లు ఎత్తి 62,725 క్యూసెక్కులను వదిలారు. శ్రీశైలం ప్రాజెక్టుకు ఎగువ నుంచి 89,417 క్యూసెక్కుల వరద వస్తుండగా, ఆరు గేట్లు, విద్యుదుత్పత్తి ద్వారా 2,28,634 క్యూసెక్కుల అవుట్‌ఫ్లో నమోదైంది. పూర్తిస్థాయి నీటి నిల్వ 215.807 టీఎంసీలకుగాను ప్రస్తుతం 199.7354 టీఎంసీలుగా ఉన్నది.



సాగర్ డ్యామ్ వద్ద పర్యాటకులు

### మేడిగడ్డకు 3.41 లక్షల క్యూసెక్కుల వరద

జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని మేడిగడ్డ బరాజ్‌కు ఆదివారం 3,41,350 క్యూసెక్కుల ప్రవాహం వచ్చింది. దీంతో మొత్తం 85 గేట్లు ఎత్తి అంతే మొత్తంలో నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. అన్నారం బరాజ్‌కు 4,500 క్యూసెక్కుల నీరును వస్తుండగా, 66 గేట్ల ద్వారా నీటిని దిగువకు వదులుతున్నారు. సమ్మక్క బరాజ్ వద్ద గోదావరి వరద తగ్గుతున్నది. ఎగువనుంచి 4,39,600 క్యూసెక్కుల వరద వస్తుండగా 59 గేట్లను ఎత్తి దిగువకు వదులుతున్నారు. మహదేవపూర్ మండలం కాళేశ్వరం పుష్కరఘాట్ వద్ద గోదావరి నది ఆదివారం సాయంత్రం 3.41 క్యూసెక్కుల ప్రవాహం ఉన్నది.

### కొనసాగుతున్న ఎత్తిపోతలు

కాళేశ్వరం ప్రాజెక్టు లింక్-2లో ఎత్తిపోతలు కొనసాగుతున్నాయి. పెద్దపల్లి జిల్లాలోని శ్రీపాద ఎల్లంపల్లి జలాశయం నుంచి అండర్ టన్నెళ్ల ద్వారా ధర్మారం మండలం నందిమేడారంలోని నంది పంప్‌హౌస్‌కు జలాలు చేరుతుండగా, ఆదివారం 5వ నంబర్ మోటర్ ద్వారా 3,150 క్యూసెక్కుల నీటిని నంది రిజర్వాయర్‌లోకి ఎత్తిపోస్తున్నారు. అక్కడి నుంచి జంట సొరంగాల ద్వారా కరీంనగర్ జిల్లా రామడుగు మండలం లక్ష్మీపూర్‌లోని గాయత్రి పంప్‌హౌస్‌కు తరలిపోతున్నాయి. ఇక్కడ ఆదివారం 5వ నంబర్ మోటర్ ద్వారా 3,150 క్యూసెక్కుల నీటిని శ్రీ రాజరాజేశ్వర జలాశయానికి తరలిస్తున్నారు. కాగా, ఆదివారం సాయంత్రం వరకు ఎల్లంపల్లి నుంచి 13.2 టీఎంసీలకు పైనే జలాలు మధ్యమానేరుకు తరలించినట్టు అధికారులు తెలిపారు. మధ్యమానేరు నుంచి సిరిసిల్ల జిల్లాలోని అన్నపూర్ణ ప్రాజెక్టుకు నీటిని తరలిస్తున్నారు. మధ్యమానేరు నుంచి అండర్ టన్నెళ్ల ద్వారా తిప్పాపూర్‌లోని సర్జ్ పూల్‌కు జలాలు చేరుతుండగా, ఇక్కడ పంప్‌హౌస్‌లో రెండు బాహుబలి మోటర్ల ద్వారా 6,440 క్యూసెక్కులు అన్నపూర్ణ జలాశయానికి తరలిస్తున్నారు. ఇక్కడ జలాశయం గేట్లు తెరిచి అంతే మొత్తంలో రంగనాయక సాగర్‌కు వదులుతున్నారు.

## కొట్టుకుపోయిన తుంగభద్ర డ్యామ్ గేటు

హైదరాబాద్, ఆగస్టు 11 (నమస్తే తెలంగాణ)/కొప్పల్: కర్ణాటకలోని తుంగభద్ర డ్యామ్ 19వ గేటు కొట్టుకుపోయింది. శనివారం రాత్రి చైన్ లింక్ తెగిపోవడమే ఇందుకు కారణమని తెలుస్తున్నది. కొట్టుకుపోయిన గేటుపై ఒత్తిడిని తగ్గించేందుకు అధికారులు మరో ఏడు గేట్లను తెరిచి నీటిని దిగువకు వదులుతున్నారు. దీంతో దాదాపు లక్ష క్యూసెక్కుల నీరు వృథాగా పోతున్నది. కొట్టుకుపోయిన గేటుకు మరమ్మతు పనులను చేపట్టాలంటే 60-65 టీఎంసీల నీటిని అత్యవసరంగా కిందకు విడుదల చేయాలని కర్ణాటకలోని కొప్పల్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి శివరాజ్ తంగడగి చెప్పారు. 20 అడుగుల మేర నీటిని వదిలిన తర్వాతే సమస్య పరిష్కారం అవుతుందని తెలిపారు. ఈ నేపథ్యంలో కొప్పల్ దిగువ ప్రాంతాల ప్రజలకు కర్ణాటక అధికారులు వరద హెచ్చరికలు జారీ చేశారు. ఆంధ్రప్రదేశ్ అధికారులు అప్రమత్తమై ఉమ్మడి కర్నూలు జిల్లాతోపాటు సమీప ప్రాంతాల ప్రజలకు హెచ్చరికలు జారీచేశారు.

## వానకాలం

| | గరిష్ఠం | కనిష్ఠం |
|---|---|---|
| రంగారెడ్డి | 36.4°c | 22.7°c |
| ఆదిలాబాద్ | 36.2°c | 23.0°c |
| నల్లగొండ | 32.0°c | 23.6°c |
| మెదక్ | 35.5°c | 22.9°c |
| ఖమ్మం | 33.0°c | 26.0°c |
| నిజామాబాద్ | 32.8°c | 24.9°c |
| కరీంనగర్ | 32.0°c | 25.0°c |
| మహబూబ్‌నగర్ | 31.2°c | 23.1°c |
| వరంగల్ | 31.0°c | 25.0°c |
| హైదరాబాద్ | 30.0°c | 27.0°c |

## మరో రెండు రోజులు వానలు

- ఏడు జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ

హైదరాబాద్, ఆగస్టు 11 (నమస్తే తెలంగాణ): తెలంగాణలో మరో రెండ్రోజులపాటు రాష్ట్రంలో వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. నిర్మల్, భూపాలపల్లి, ములుగు, ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, కొత్తగూడెం జిల్లాల్లో అక్కడక్కడ వర్షాలు కురుస్తాయని పేర్కొన్నది. ఆయా జిల్లాలకు ఎల్లో అలెర్ట్ జారీ చేసింది. హైదరాబాద్‌లో ఉదయం ఆకాశం మేఘావృతమై, సాయంత్రం తర్వాత జల్లులు కురవవచ్చని అధికారులు తెలిపారు. గడిచిన 24 గంటల్లో రాష్ట్రంలోని కుమ్రంభీం, మహబూబాబాద్, జగిత్యాల, పెద్దపల్లి, ఖమ్మం, సూర్యాపేట, యాదాద్రి-భువనగిరి, మహబూబ్‌నగర్, మంచిర్యాల, సిద్దిపేట జిల్లాల్లో మోస్తరు వర్షాలు కురిశాయి. కుమ్రంభీం జిల్లా తిర్యాలలో 5.65 సెం.మీ., మహబూబాబాద్ జిల్లా గార్లలో 5.47, జగిత్యాల జిల్లా పెగడపల్లిలో 4.95, సూర్యాపేట జిల్లా అనంతగిరిలో 4.26, పెద్దపల్లి జిల్లా ధర్మారంలో 4.58, ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెంలో 4.02, యాదాద్రి-భువనగిరి జిల్లా ఆత్మకూర్-ఎంలో 3.85, మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్రలో 3.67, మంచిర్యాల జిల్లా జైపూర్‌లో 3.62, సిద్దిపేట జిల్లా నంగనూర్‌లో 3.42 సెం.మీ చొప్పున వర్షపాతం నమోదైంది.

## సీతారామ ట్రయల్ సక్సెస్

మొదటిపేజీ తరువాయి...

మాట్లాడుతూ.. ఈ నెల15న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పర్యటించి సీతారామ ప్రాజెక్టు రెండు, మూడు పంపుహౌస్‌లను ప్రారంభిస్తారని చెప్పారు. అనంతరం వైరా మండలంలో నిర్వహించే రుణమాఫీ రైతుసదస్సులో కూడా సీఎం ప్రసంగిస్తారని తెలిపారు. సీతారామ ప్రాజెక్టు పనులను తమ ప్రభుత్వం ప్రాధాన్య అంశంగా తీసుకున్నదని తెలిపారు. ఈ ప్రాజెక్టును రెండేండ్లలో పూర్తిచేసి ఉమ్మడి ఖమ్మం జిల్లాకు పూర్తిస్థాయిలో సాగునీళ్లు అందిస్తామని చెప్పారు. భూసేకరణ, డిస్ట్రిబ్యూటరీ కెనాల్ పనులను యుద్ధప్రాతిపదికన చేపడతామని పేర్కొన్నారు. ఈ ప్రాజెక్ట్ నిర్మాణంతో ఉమ్మడి జిల్లా ప్రజలు, రైతుల చిరకాల వాంఛ నెరవేరుతున్నదని అన్నారు. గోదావరి జలాలు నాగార్జునసాగర్ ఆయకట్టుకు చేరనున్నాయని వివరించారు. నాగార్జునసాగర్ ప్రాజెక్టు చివరి భూములకు సాగర్ నీళ్లు రాని సమయంలో సీతారామ ప్రాజెక్ట్ ద్వారా గోదావరి జలాలను తీసుకొచ్చి ఏన్కూరు ఎన్‌ఎస్‌పీకి అనుసంధానం చేసి 1.70 లక్షల ఎకరాలకు సాగునీరు అందిస్తామని వెల్లడించారు.

### పాలేరు వరకు గోదావరి జలాలు

సీతారామ ప్రాజెక్టు వల్ల ఉమ్మడి ఖమ్మం జిల్లా రైతులకు ప్రయోజనం చేకూరుతుందని మంత్రి తుమ్మల చెప్పారు. ఉమ్మడి జిల్లా ఆయకట్టుకు కృష్ణా జలాలు సకాలంలో రాకపోతే ప్రత్యామ్నాయంగా తక్కువ ఖర్చుతో వైరా లింక్ కెనాల్ ద్వారా గోదావరి నీళ్లను అందిస్తామని వివరించారు. జూలూరుపాడు టన్నెల్ పనులు పూర్తయితే పాలేరు వరకు గోదావరి జలాలు చేరుతాయని పేర్కొన్నారు. పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. సీతారామ ప్రాజెక్టుతో ఉమ్మడి జిల్లా రైతుల చిరకాల కోరిక నెరవేరిందని అన్నారు. అనంతరం మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి కలిసి వైరాలో నిర్వహించనున్న రైతు సదస్సు వద్ద జరుగుతున్న ఏర్పాట్లను పరిశీలించారు. ఆయా కార్యక్రమాల్లో ఎమ్మెల్యేలు జారె ఆదినారాయణ, రాందాస్‌నాయక్, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, భద్రాద్రి కలెక్టర్ జితేశ్ వీ పాటిల్, ప్రభుత్వ ముఖ్య సలహదారు పెంటారెడ్డి, ఎస్పీ రోహిత్‌రాజ్, ఇరిగేషన్ సెక్రటరీ రాహుల్‌బొజ్జా, స్పెషల్ సెక్రెటరీ ప్రశాంత్ జీవన్ పాటిల్, ఇంజినీర్ ఇన్ చీఫ్ అనిల్‌కుమార్, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

## భరోసా ఇచ్చేదెప్పుడు?

మొదటిపేజీ తరువాయి...

నివేదిక అందజేస్తుందని, దాని ఆధారంగా అసెంబ్లీలో రైతుభరోసాపై చర్చ పెడతామని సీఎం ప్రకటించారు. కమిటీ ఏర్పాటు చేసి 40 రోజులైనా నివేదిక జాడ లేదు. రైతుల నుంచి అభిప్రాయ సేకరణకు ఉమ్మడి జిల్లాలవారీగా తొమ్మిది సమావేశాలు నిర్వహించాలని కమిటీ నిర్ణయించింది. ఇప్పటికి నాలుగు సమావేశాలు మాత్రమే నిర్వహించింది. జూలై 15న వరంగల్ సమావేశం నిర్వహించి ఆ తర్వాతే అపేసింది. అదే నెల 23 నుంచి అసెంబ్లీ సమావేశాలు ప్రారంభమయ్యాయి. అప్పటికే వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సేకరించిన అభిప్రాయాలతో పాటు నాలుగు సమావేశాల్లో స్వీకరించిన అభిప్రాయాల ఆధారంగా మంత్రుల కమిటీ నివేదిక ఇస్తుందేమోనని అంతా భావించారు. కానీ, 15 రోజుల్లో ఇస్తారన్న నివేదిక అతీ గతీ లేకుండా పోయింది.

### అసెంబ్లీలో చర్చ ఏమైంది?

రైతుభరోసాపై అసెంబ్లీలో చర్చ పెడతామని చెప్పిన ప్రభుత్వం.. సమావేశాలు జరుగుతున్నప్పుడు ఆ ఊసే ఎత్తకపోవడం గమనార్హం. 11 రోజులపాటు అసెంబ్లీ సమావేశాలు జరిగితే ఒక్కపూట కూడా రైతుభరోసాపై ప్రభుత్వం చర్చించలేదు. ఈ నేపథ్యంలో రైతుభరోసాపై ప్రభుత్వం కావాలనే ఆలస్యం చేస్తున్నదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఒకవేళ రైతులకు సకాలంలో పెట్టుబడి సాయం అందించాలనే ఆలోచన ప్రభుత్వానికి ఉంటే.. మంత్రుల కమిటీ నుంచి నివేదిక తెప్పించుకొని, అసెంబ్లీలో చర్చ పెట్టి, విధి విధానాలు రూపొందించేదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వం ఇవేవీ చేయకపోవడంతో ఉద్దేశపూర్వకంగానే ఆలస్యం చేస్తున్నదనే విమర్శలొస్తున్నాయి.

# ఒక్కో వైన్స్‌కు అదనపు టార్గెట్ 50 లక్షలు!

మొదటిపేజీ తరువాయి...

నిర్ణయమో, ఎక్సైజ్ ఉన్నతాధికారుల ఒత్తిడో తెలియదు కానీ, ఇటు మద్యం వ్యాపారులకు, ఎక్సైజ్ కిందిస్థాయి అధికారులకు అదనపు కష్టాలు వచ్చిపడ్డాయి. రాష్ట్రవ్యాప్తంగా ప్రతినెలా ఒక్కో లక్ష్యాన్ని చేరుకోవడానికి ఎన్నో ఇబ్బందులు పడుతున్నారు. ఈ నెల టార్గెట్లు పూర్తి కాలేదని, పై అధికారులు టార్గెట్లు పెట్టారని, వీలున్నంత మేర స్టాక్ తీసుకెళ్లాలని మద్యం దుకాణదారులపై నిత్యం ఒత్తిడి తీసుకొస్తున్నట్టు తెలిసింది. మూడు నెలలుగా రాష్ట్రంలో మద్యం అమ్మకాలు నెలకు రూ.3 వేల కోట్లకు మించి జరుగుతున్నాయి. జూన్‌లో రూ.3,175 కోట్లు దాటింది. అయితే, జూలై నెలలో రూ.3 వేల కోట్లలోపే ఉండడంతో ఎట్టి పరిస్థితుల్లోనూ లక్ష్యం చేరాల్సిందేనని రిటైలర్లపై ఒత్తిడి పెంచినట్టు సమాచారం. ‘గోదాముల్లో సరుకు రెడీగా ఉన్నది. ఈ నెలలో అమ్మకాల లక్ష్యం పూర్తి చేయాలి. ఉన్నతాధికారులు ఒత్తిడి తెస్తున్నారు. మందు కొంటారా? లేదా? ముందు ఎంతో కొంత సరుకు తీసుకెళ్లండి’ అంటూ యజమానులకు ఫోన్లు చేస్తున్నారని తెలిసింది. దీంతో చేసేదేమీ లేక డీడీలు చెల్లించి స్టాక్ తీసుకెళ్తున్నారు.

### బెల్టుషాపుల్లో ఏరులై పారుతున్న మద్యం

ప్రభుత్వం విధించిన లక్ష్యాన్ని చేరుకోవడానికి, వడ్డీలకు తెచ్చిన డబ్బులు చెల్లించడానికి తప్పని పరిస్థితుల్లో బెల్టుషాపులకు అడిగినంత మందు ముట్టచెప్తున్నట్టు విశ్వసనీయ సమాచారం. దీంతో ఏ గ్రామంలో చూసినా మద్యం ఏరులై పారుతోంది. ఆఖరికి గ్రామాల్లోని కిరాణా షాపుల్లో సైతం మద్యం దొరుకుతున్నదంటే పరిస్థితి ఎలా ఉన్నదో అర్థం చేసుకోవచ్చు. ఒకరిని చూసి మరొకరు కొత్త బెల్టుషాపులకు తెర తీస్తున్నారు. వీటిపై ఎక్సైజ్, పోలీసుశాఖలు పూర్తిగా నియంత్రణ కోల్పోయాయి. ప్రభుత్వ లక్ష్యం నేరవేరేందుకు వారు సైతం బెల్టుషాపుల వైపు కన్నెత్తి కూడా చూడడం లేదు. అధికారంలోకి రాగానే బెల్టుషాపులు ఎత్తివేస్తామన్న ప్రభుత్వం ఆ హామీని ఏం చేసిందని పలువురు ప్రశ్నిస్తున్నారు. గత ప్రభుత్వం ఓ క్రమపద్ధతిలో మద్యం విక్రయాలు జరుపగా, ప్రస్తుత ప్రభుత్వం ఆ నిబంధనలన్నీ తుంగలో తొక్కి టార్గెట్ల పేరుతో మద్యం వ్యాపారులను పీల్చి పిప్పి చేస్తున్నది.

### రూ. లక్ష మద్యం కొంటే 15 శాతం నష్టం

జనాభా ప్రాతిపదికన శ్లాబ్ ప్రకారం టెండర్ దక్కించుకున్నా, నిర్ణీత కోటా అయిపోయిన తర్వాత తాము చెల్లించే మొత్తంలో సుమారు 15 శాతం నష్టపోవాల్సి వస్తున్నదని వైన్స్ షాప్ యజమానులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉదాహరణకు ఓ ప్రాంతంలో రూ.50 లక్షల శ్లాబ్‌లో టెండర్ దక్కించుకున్న వ్యాపారికి పదిసార్ల వరకు ఐఎంఎల్ డిపోలో కొనుగోలు చేసిన మద్యానికి ఎలాంటి అదనపు పన్ను ఉండదు. అంతకుమించి కొనుగోలు చేస్తే రూ. లక్షకు దాదాపు 15 శాతం అంటే రూ.15 వేలు అదనంగా పన్ను రూపంలో చెల్లించాలి. దీంతో పాటు అమ్మకాలు లేని సమయంలో కొనుగోలు చేయాల్సి రావడం తమకు తలకుమించిన భారంగా మారిందని, వడ్డీలకే డబ్బు సరిపోని పరిస్థితి ఉందని వైన్‌షాప్ యజమానులు వాపోతున్నారు. ‘ఒక్కో షాపునకు రూ.20 లక్షల నుంచి రూ.50 లక్షల వరకు అదనంగా మద్యం కొని అమ్మాలట. ఇట్లైతే మేం మందు అమ్మలేం సారు’ అంటూ ‘నమస్తే తెలంగాణ’తో ఓ మద్యం దుకాణదారుడు వాపోయాడు. అన్ని జిల్లాల్లోనూ ఇదే తరహా టార్చర్ ఉందని తోటి వ్యాపారులు కూడా చెప్తున్నారని పేర్కొన్నాడు.

# డబ్బులివ్వకుంటే మీ కొడుకును కాల్చేస్తం

- భయపెట్టి దోచేస్తున్న సైబర్ నేరగాళ్లు
- విదేశాల్లో అల్లర్ల ఆసరాతో ఫోన్‌కాల్స్
- నానారకాలుగా బెదిరించి డబ్బు డిమాండ్
- నమ్మి మోసపోతున్న తల్లిదండ్రులు
- అలాంటివాటికి స్పందించొద్దు : సైబర్‌క్రైమ్ పోలీసులు


హైదరాబాద్ సిటీబ్యూరో, ఆగస్టు 11 (నమస్తే తెలంగాణ) : ‘మీ కొడుకును మేం పట్టుకున్నం.. మాకు డబ్బులు పంపకపోతే కాల్చి చంపేస్తం’ అంటూ సైబర్ నేరగాళ్లు కొత్త పంథాలో బెదిరింపులకు దిగుతూ దోచేస్తున్నారు. లండన్‌లో కొంతకాలంగా జరుగుతున్న అల్లర్లను అడ్డం పెట్టుకొని తాము లండన్ నుంచి ఫోన్ చేస్తున్నామంటూ పాకిస్థాన్ కోడ్‌తో వచ్చే నంబర్లతో వాట్సాప్ కాల్స్ చేస్తూ భయాందోళనలకు గురిచేస్తున్నారు. ప్రపంచంలో ఎక్కడ ఎలాంటి ఘటనలు జరుగుతున్నా సైబర్‌నేరగాళ్లు వాటిని తమకు అనుకూలంగా మార్చుకుంటూ ఫోన్లు చేస్తూ అందినకాడికి దండుకుంటున్నారు. తమ పిల్లలు చదువు, ఉద్యోగాల కోసం యూకేకు వెళ్లడంతో నిజంగానే వారు ఆపదలో చిక్కుకున్నారేమోనని తల్లిదండ్రులు భయపడుతూ నేరగాళ్లకు డబ్బు కూడా పంపి మోసపోతున్నారు. ఒకవేళ యూకేలో తమ పిల్లలు లేరని చెబితే ముంబయి, ఢిల్లీ ఇలా ఏదో ఒక ప్రాంతం పేరు చెప్పి ఆందోళన కలిగేలా చేస్తున్నారు. నేరుగా ఫోన్ చేసి బెదిరించే ముఠాలు కొన్నయితే, మరి కొన్ని ముఠాలు పోలీస్ దుస్తులు వేసుకొని ‘మేం పోలీసులం మీ పిల్లలను పట్టుకున్నం’ అంటూ వివిధ కేసుల వివరాలు చెబుతూ నమ్మించే ప్రయత్నాలు చేస్తున్నాయి.

### వాట్సాప్ కాల్స్‌తోనే!


ఇలాంటి మోసాలకు పాల్పడుతున్న సైబర్ చీటర్స్ ఎక్కువగా వాట్సాప్ కాల్స్‌తోనే మాట్లాడుతున్నారు. కొన్ని సందర్భాల్లో మొదట సాధారణ కాల్ చేసి డ్రగ్స్, మనీలాండరింగ్ నేరాలు జరిగాయంటూ బెదిరిస్తున్నారు. అలాంటి బెదిరింపులకు భయపడి స్పందిస్తే వెంటనే పోలీస్ అధికారి మాట్లాడుతాడంటూ మాట్లాడిస్తూ ఆందోళన కల్గిస్తున్నారు. ‘మీవాడు కేసుల్లో ఇరుక్కున్నాడు.. మా అదుపులో ఉన్నాడు, డబ్బులివ్వకపోతే కాల్చేస్తాం.. మీ పేరుతో పార్సిల్ ఒకటి వెళ్తుంది.. అందులో మీ ఫోన్ నంబర్ ఉంటుంది. ఇది డ్రగ్ మాఫియా లింక్‌కు సంబంధముంటుంది.. దావూద్ ఇబ్రహీం గ్యాంగ్‌లతో మీకు సంబంధాలు అంటగడుతం’ అంటూ బెదిరించి డబ్బు వసూలు చేస్తున్నారు. పోలీసులమని చెప్పుకొనే కొందరు వాట్సాప్‌లో వీడియో కాల్స్, స్కైప్ కాల్స్ చేసి ఓవైపు సహాయం చేస్తున్నట్టే నటిస్తూ మరోవైపు ‘మేం ఆర్బీఐ, సీబీఐ, ఎన్ఐఏ వాళ్లం.. మీ బ్యాంకు ఖాతాలు విశ్లేషించాలి.. అందుకు మీ ఖాతాలోని డబ్బు ఆర్బీఐకి పంపించాలి’ అని మోసం చేస్తున్నారు. అనుమానాస్పద నంబర్లు, ఇతర దేశాల కోడ్‌లతో వచ్చే కాల్స్‌కు ఎవరూ బెదిరిపోవద్దని సైబర్‌క్రైమ్ పోలీసులు సూచిస్తున్నారు.

## ‘మీ పిల్లలు డ్రగ్స్‌తో పట్టుబడ్డరు’

- డబ్బులు ట్రాన్స్‌ఫర్ చేస్తే వదిలేస్తం
- సీబీఐ పేరిట బెదిరింపు కాల్స్
- నిర్మల్ జిల్లా భైంసాలో ఘటనలు



కాల్స్ వస్తున్న నంబర్ డీపీ ఉన్న పోలీస్‌ఫొటో



బెదిరింపు కాల్ వచ్చిన వెంకటేశ్ కాంబ్లే

భైంసా టౌన్, ఆగస్టు 11 : ‘మేం సీబీఐ పోలీసు లం. మీ పిల్లలు డ్రగ్స్ అమ్ముతూ పట్టుబడ్డరు. డబ్బులు ట్రాన్స్‌ఫర్ చేయాలి’ అంటూ కొన్ని రోజులుగా నిర్మల్ జిల్లా భైంసా పట్టణంతో పాటు మండలంలోని పలువురికి సీబీఐ పోలీస్ పేరిట వాట్సాప్ కాల్స్ వస్తున్నాయి. ఈ క్రమంలో శనివారం మండలంలోని ఇలేగాంకు చెందిన వెంకటేశ్ కాంబ్లేకు ‘నీ కూతురు డ్రగ్స్ అమ్ముతూ దొరికింది. పది నిమిషాల్లో మా దగ్గరికి రావాలి’ అని గుర్తుతెలియని వ్యక్తులు కాల్ చేశారు. ఆందోళనకు గురైన వెంకటేశ్ కాంబ్లే పాఠశాలకు వెళ్లి చూడగా అమ్మాయి క్షేమంగానే ఉన్నదని తెలుసుకొని ఊపిరి పీల్చుకున్నాడు. పట్టణంలోని భట్టిగల్లీకి చెందిన ఓ వ్యక్తికి కూడా ఫోన్ రాగా అతను డయల్ 100 ద్వారా పోలీసులకు సమాచారమిచ్చాడు. విద్యార్థులను లక్ష్యంగా చేసుకుని వారి పేరు, తండ్రి పేరు, ఫోన్ నంబర్, ఊరి పేరు చెబుతూ ఫోన్ కాల్స్ చేస్తున్నారు.

# గురుకులంలో గురువులేరి?

మొదటిపేజీ తరువాయి...

పోస్టులు ఖాళీగానే ఉన్నాయి. ఒక్క కొడంగల్ బాలుర గురుకులంలోనే మొత్తంగా 22 పోస్టులు ఖాళీ పెట్టడం గమనార్హం. హైదరాబాద్, రంగారెడ్డితో పాటు పలు జిల్లా హెడ్‌క్వార్టర్స్‌లోని గురుకులాల్లో కొన్ని గ్రూపులకు విద్యార్థులు లేకున్నా అక్కడ అన్ని సబ్జెక్టులకు ఉపాధ్యాయులు, లెక్చరర్లను నియమించటం విచిత్రం. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా ఉప్పల్‌లోని ఎస్సీ గురుకులంలో ఇంటర్ ఎంపీసీ, బైపీసీ గ్రూపులున్నాయి. ఈ రెండు గ్రూపుల్లో విద్యార్థులెవరూ లేకపోయినా అన్ని సబ్జెక్టులకు జేఎల్స్‌ను నియమించారు. రంగారెడ్డి జిల్లా హయత్‌నగర్, నల్లగొండ జిల్లా తిప్పర్తి, అనుముల, నకిరేకల్ గురుకులాల్లోనూ ఇదే పరిస్థితి.

### పేర్లు లేకుండానే ఉత్తర్వులు!

ప్రభుత్వం ఒక ఉత్తర్వు ఇవ్వాలంటే కచ్చితంగా ఒక ఫైల్ మూమెంట్ తర్వాత, అప్రూవల్ అయిన తర్వాత ఆ ఫైల్ నంబరు, ప్రొసీడింగ్స్ నంబర్‌ను మెన్షన్ చేస్తూ బదిలీగానీ, ప్రమోషన్ ఉత్తర్వులు గానీ, నూతన నియామక ఆదేశాలు గానీ ఇవ్వాలి. అలా ఇచ్చిన ప్రతి ఉత్తర్వు మీద జారీచేసిన అధికారి పేరు, హోదాను పేర్కొనటం సంప్రదాయం. అప్రూవల్ కాపీలలో ఉండే ప్రొసీడింగ్స్ నంబర్స్ ఆధారంగా ప్రతి ఉద్యోగి వివరాలు వారివారి సర్వీస్ రిజిస్టర్లలో నమోదు చేస్తుంటారు. కానీ, ఎస్సీ, మైనార్టీ గురుకులాల్లో అందుకు పూర్తి విరుద్ధంగా ఒక విచిత్ర పరిస్థితి నెలకొన్నది. ఒక కార్పొరేట్ సెక్టార్‌లో సర్టిఫికెట్ ఇచ్చినట్టు మాదిరిగా ప్రమోషన్, బదిలీ, నూతన నియామక ఉత్తర్వులను జారీచేయటం ఉపాధ్యాయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

### ఒకే ఉద్యోగికి అన్ని జోన్లలో..!

ఆర్ట్ విభాగానికి సంబంధించి జోన్-3లో ఉన్న ఓ ఉద్యోగిని తొలుత జోన్-5కు బదిలీ చేశారు. ఆ వెంటనే జోన్-4కు బదిలీ చేసి మళ్లీ జోన్-3లోనే పోస్టింగ్ ఇచ్చారు. మళ్లీ రాత్రికిరాత్రే సదరు ఉద్యోగిని జోన్-1కి, ఆ మరుసటి రోజున అక్కడి నుంచి జోన్-2కు మారుస్తూ పోస్టింగ్ ఇచ్చారు. చివరికి ఇటీవల తిరిగి జోన్-5కు సదరు ఆర్ట్ టీచర్‌ను బదిలీ చేశారు. ఇదొక్కటే కాదు ఎస్సీ గురుకుల డిగ్రీ కాలేజీ పీడీ (ఫిజికల్ డైరెక్టర్) బదిలీల జాబితాను సైతం 3 సార్లు మార్చారు. మహిళా గురుకులాల్లో పురుషులకు పోస్టింగ్ ఇవ్వకూడదనే నిబంధన పెట్టుకున్నారు. కానీ అందుకు విరుద్ధంగా పలువురికి మహిళా గురుకులాల్లో పోస్టింగ్ ఇచ్చారు. అంతే కాదు ఫోకల్ టు ఫోకల్ బదిలీ ఇవ్వకూడదు. ఆ నిబంధనకూ అధికారులు పాతరేశారు.

### మైనార్టీ గురుకులంలో..

మైనార్టీ గురుకులాల్లోనూ ప్రమోషన్లు, బదిలీల ఉత్తర్వుల్లో గందరగోళమే. మొదట వెబ్ కౌన్సెలింగ్ అని చెప్పి తర్వాత మాన్యువల్‌గా మార్చారని, లాంగ్ స్టాండింగ్ ఉన్నవారికి సేమ్ ప్లేసెస్‌లో ప్రమోషన్లు ఇవ్వటాన్ని తప్పుబడుతూ కోర్టుకు వెళ్లిన వారికి కక్షసాధింపుగా ప్రమోషన్లను నిలిపివేశారని సొసైటీ ఉన్నతాధికారుల తీరుపై ఉద్యోగ, ఉపాధ్యాయులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పోస్ట్ గ్రాడ్యుయేషన్‌లో ఎమ్మెస్సీ బాటనీ చేసిన వారికి జేఎల్ జువాలజీలుగా పదోన్నతి కల్పించారంటే సొసైటీలో పరిస్థితి ఎంత దారుణంగా తయారైందో అర్థం చేసుకోవచ్చని ఉదహరిస్తున్నారు. ప్రమోషన్ తీసుకున్న ఉద్యోగులకు 24 గంటలు గడిచేలోగానే రివర్షన్ ఉత్తర్వులు ఇస్తున్న దుస్థితి నెలకొన్నది.

### బీసీ వెల్ఫేర్‌లోనూ..

బీసీ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్‌లో సంక్షేమ హాస్టళ్ల వెల్ఫేర్ ఆఫీసర్ (హెచ్‌డబ్ల్యూవో)ల బదిలీలను చేపట్టారు. ఇందులో 100కు పైగా పోస్టులకు పైరవీలతో పోస్టింగ్ ఇచ్చారని హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ సంఘాలు ఆరోపిస్తున్నాయి. నాలుగేండ్ల సర్వీస్ పూర్తి చేసుకున్న అధికారులను తప్పనిసరి బదిలీ చేయాలని ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు ఇచ్చింది. అయితే 15 ఏండ్లుగా ఒకే దగ్గర ఉద్యోగం చేస్తున్న వారిని బదిలీ చేసినట్టే చేసి, మళ్లీ అదే స్థానంలో పోస్టింగ్ ఇవ్వటమే ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. ఏడో జోన్ పరిధిలోని ముగ్గురు ఉద్యోగులను బదిలీ చేయకపోవటంలో అక్రమాలు జరిగినట్టు అనుమానాలు ఏర్పడుతున్నాయి. ఇక, గ్రేడ్-2 వార్డెన్లకు ఇటీవల బదిలీల ప్రక్రియలో సీనియార్టీ జాబితాను 2 సార్లు మార్చారు. స్పౌజ్ కేసుల విషయంలో వెసులుబాటు ఉన్నా ఆ విషయాన్ని విస్మరించి ఇష్టానుసారం బదిలీలు చేశారని ఆరోపణలు వినిపిస్తున్నాయి.



### తప్పులు సరిచేస్తున్నాం

*మైనార్టీ గురుకుల సొసైటీ బదిలీలకు తొలుత వెబ్ కౌన్సిలింగ్ అని చెప్పే ఆప్షన్స్ తీసుకున్నాం. ఉద్యోగ, ఉపాధ్యాయుల నుంచి అభ్యంతరాలు రావటంతోనే మాన్యువల్‌గా నిర్వహించాం. ప్రధానంగా 317 జీవో డిస్‌లోకేటెడ్ సిబ్బంది ఉన్న చోట ఇబ్బందులు వచ్చాయి. సదరు సిబ్బంది ఉన్న పోస్టులను కూడా ఖాళీలుగా చూపటంతో గందరగోళం ఏర్పడింది. ఈ నేపథ్యంలో జరిగిన లోపాలన్నింటినీ గుర్తించి సరిచేస్తున్నాం. ఎవరికీ ఇబ్బంది లేకుండా న్యాయం చేస్తున్నాం.*

**- ఆయేషా మస్రత్ ఖానమ్, సెక్రటరీ, మైనార్టీ గురుకుల సొసైటీ**